నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ గురువారం 16 మే 2024 | ADILABAD NIRMAL

## గోదావరి తీరాన మహాహారతి



హారతి కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్

బాసర, మే 15 : బాసర గోదావరి తీరాన ప్రతి బుధవారం నిర్వహించే హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ హారతి కార్యక్రమంలో అడిషనల్ ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. గోదావరి తీరాన అర్చకులు, వేద పండితులు గోదావమ్మకు పూజలు నిర్వహించిన అనంతరం హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో విజయ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## హత్యాయత్నం చేయించారని ఫిర్యాదు



టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ఎదులాపురం, మే 15 : కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం తన ఇంట్లో చొరబడి హత్యాయత్నం చేశారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గటిక కాంత్రికుమార్ ఆదిలాబాద్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం మధ్యాహ్నం తన మిత్రులు తన వెంట ఉన్నారని ప్రాణపాయం తప్పిందని బాధితుడు పేర్కొన్నారు. పట్టుకున్న దుండగులను ప్రశ్నిస్తే కంది శ్రీనివాస్‌రెడ్డి, లోక ప్రవీణ్‌రెడ్డి, జాహీర్ రంజానీ, షకీల్ డబ్బులు ఇచ్చి తనను చంపేందుకు పంపినట్లు చెప్పాడని అ ఫిర్యాదులో పేర్కొన్నాడు. దుండగులను టూ టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ విషయంలో బీజేపీ నాయకులు స్థానిక టూటౌన్ ఎదుట ఆందోళనలకు దిగారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి వచ్చిన ఫిర్యాదు మేరకు సమగ్ర విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని తెలిపాడు.



బోథ్ : మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో వర్షం కురుస్తుండగా జొన్న సంచులపై తడవకుండా టార్పాలిన్లు కప్పిన రైతులు



కడెం : ధాన్యం వద్ద వర్షపు నీరు నిలువగా కాలువలు తీస్తూ..



కడెం : మద్దిపడగలో వడ్లపై కవర్లు కప్పుతూ..



సిరికొండ : ధర్మసాగర్‌లో వృక్షాన్ని తొలగిస్తున్న స్థానికులు



ఇంద్రవెల్లి : డోంగర్‌గాంలో ఎగిరిపోయిన ఇండ్ల పైకప్పులు



ఇంద్రవెల్లి : ఇండ్లలో చేరిన వర్షపు నీటిని తొలగిస్తున్న మహిళ

# అయ్యో.. రైతన్న

- అకాల వర్షంతో తడిసి ముద్దయిన ధాన్యం
- ఆరబోసిన వడ్లను కాపాడుకునేందుకు శ్రమించిన రైతులు
- నువ్వులు, పెసర పంటలకు తీవ్రనష్టం.. నేలరాలిన మామిడి..
- గాలిదుమారంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం
- కాంగ్రెస్ సర్కారు ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని వేడుకోలు
- నిర్మల్ జిల్లాలో 6.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కడెం మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన వడ్లు తడిసి ముద్దయ్యాయి. బెల్లాల్, మద్దిపడగ, చిట్యాల్, పెద్దూర్ గ్రామాల్లో రైతులు వడ్లపై కవర్లు కప్పుతూ కాపాడే యత్నం చేశారు. ముథోల్ మండలంలో సజ్జ, మొక్క జొన్న ఉత్పత్తులు తడిసి ముద్దయ్యాయి. దిలావర్‌పూర్ మండలంలోని నిర్మల్-భైంసా 61వ జాతీయ రహదారిపై చెట్లు నేలకొరిగాయి. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. చేతి కందిన మామిడి, నువ్వు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తాంసి మండలంలో కోసిన నువ్వులు, జొన్న పంటలు తడిసి ముద్దయ్యాయి. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. బోథ్ మండలంలో బుధవారం ఉదయం గంటపాటు వర్షం కురియడంతో మార్కెట్ యార్డుకు జొన్నలు అమ్మకానికి తెచ్చిన రైతులు వర్షంతో తంటాలు పడ్డారు. తూకం వేసి సంచుల్లో నింపిన, కుప్పలుగా పోసిన జొన్నలు తడవకుండా ఉండేందుకు అష్టకష్టాలు పడి టార్పాలిన్లు కప్పారు. సంచుల కింది బాగం నుంచి వర్షపు నీరు రాకుండా ఉండేందుకు తడుస్తూ శ్రమించారు. గాలితో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కోత దశకు చేరుకున్న నువ్వులు, పెసర పంటలతోపాటు కోస్తున్న జొన్న పంటకు వర్షం నష్టం కలిగించింది. మామిడి కాయలు నేలరాలాయి. ఇచ్చోడ మండలంలోని ధర్మసాగర్ వెళ్లే రోడ్డు మార్గంలో పెద్ద వృక్షం పడిపోవడంతో 108 అంబులెన్స్ సేవలు నిలిచాయి. అనంతరం స్థానికులు వృక్షాన్ని తొలగించారు. ఇంద్రవెల్లి మండలంలోని పలు గ్రామాల్లో పలువురి ఇండ్ల పైకప్పులు, రేకులు ఉడిపోయాయి. దీంతో ఇండ్లల్లో వర్షపు నీరు చేరడంతో నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు తడిసిపోయాయి. తడిసిన వడ్లను కొనుగోలు చేయాలని, లారీలు కేంద్రాలకు త్వరగా వచ్చేలా నిర్వాహకులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని రైతులు కోరుతున్నారు.

### జిల్లాలో 6.4 మిల్లీ మీటర్ల వర్షపాతం

నిర్మల్ జిల్లాలో బుధవారం ఉదయం వరకు నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల్లో చిరుజల్లులు పడ్డాయి. మామడ, పెంబి, కడెం, ఖానాపూర్, దస్తురబాద్ మండలాలు మినహా మిగతా మండలాల్లో వర్షం పడింది. జిల్లా వ్యాప్తంగా 6.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా.. దిలావర్‌పూర్‌లో అత్యధికంగా 24.2 మిల్లీమీటర్లు, లక్ష్మణచాందలో అత్యల్పంగా 0.2 మిల్లీమీటర్లుగా నమోదైంది. - నమస్తే నెట్‌వర్క్

## పేషెంట్ కేర్ టేకర్ ఆత్మహత్యాయత్నం



రిమ్స్ ఎదుట ధర్నా చేస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు, రిమ్స్ కార్మికులు

ఎదులాపురం, మే 15 : రిమ్స్ ఆసుపత్రిలో పేషెంట్ కేర్ టేకర్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బుధవారం తెల్లవారుజామున రిమ్స్‌లోనే ఆమె సూపర్‌వైజర్ బెదిరింపులు తట్టుకోలేక ఫినాయిల్ తాగింది. గమనించిన సిబ్బంది ఎంఐసీయూ వార్డుకు తరలించారు. సమాచారం అందిన వెంటనే రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఎంఐసీయూలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సూపర్‌వైజర్ బీ రవిని సస్పెండ్ చేసినట్లు డైరెక్టర్ తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇచ్చేందుకు త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటారు.

### కార్మిక సంఘాల ధర్నా

లక్ష్మి ఆత్మహత్యాయత్నానికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ రిమ్స్ ఆసుపత్రి ఎదుట కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ ధర్నాలో కార్మిక సంఘాల ప్రతినిధులు అన్నమొల్ల కిరణ్, విజ్జగిరి నారాయణ, ప్రభాకర్‌రెడ్డి, కుంటాల రాములు పాల్గొన్నారు.

## దిష్టిబొమ్మలు దహనం



ఎమ్మెల్యే పాయల్ శంకర్, గండ్రత్ సుజాత, అల్లూరి సంజీవ్ రెడ్డి ఫ్లెక్సీలతో కాంగ్రెస్ నాయకుల నిరసన

ఎదులాపురం, మే 15 : బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కాంగ్రెస్ పార్టీ మాజీ నాయకులు గండ్రత్ సుజాత, అల్లూరి సంజీవ్‌రెడ్డిలు లోపాయికారి ఒప్పందం చేసుకుని డబ్బులకు అమ్ముడుపోయి పార్లమెంట్ ఎన్నికల్లోనూ తీరని నష్టం చేశారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గిమ్మ సంతోష్‌రావు అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణంలోని కైలాస్‌నగర్‌లోని ప్రజాభవన్ వద్ద ఎమ్మెల్యే పాయల్ శంకర్, గండ్రత్ సుజాత, అల్లూరి సంజీవ్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఆ ముగ్గురికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా సంతోష్‌రావు మాట్లాడుతూ.. ఈ లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ నాయకులతో ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ శ్రీనివాస్‌రెడ్డి సుజాత తప్పిదాన్ని ఎత్తిచూపారు తప్పా, మున్నూరు కాపులను ఎక్కడా దూషించలేదన్నారు. ఈ విషయాన్ని సంఘం సోదరులు గమనించాలని విజ్ఞప్తి చేశారు. పాయల్ శంకర్ అనవసరంగా కులమతాల మధ్య చిచ్చు పెట్టేయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, జైనథ్ జడ్పీటీసీ తుమ్మల ఆరుంధతి, వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు సాయిప్రణయ్, జాఫర్ అహ్మద్, ఆవుల వెంకన్న, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీలేఖ, అన్నపూర్ణ, నలగంటి నవీన్, తమ్మల చందు, ఖయ్యూం, బండిదే విదాస్‌చారి పాల్గొన్నారు.

## కంది శ్రీనివాస్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

### గండ్రత్ సుజాతపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం..



మున్నూరు కాపు సంఘ భవనం వద్ద ఆందోళన చేస్తున్న ఆ సంఘం నాయకులు

ఎదులాపురం, మే 15 : ఆదిలాబాద్ పార్లమెంట్‌కు ఎన్నిక ముగిసిన తర్వాత కాంగ్రెస్ ప్టారీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం ప్రజాసేవ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, అల్లూరి సంజీవ్‌రెడ్డిలు పార్టీ ద్రోహులని పేర్కొన్నాడు. బీజేపీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని, డబ్బుల సంచులు తీసుకుని తమ కార్యకర్తలను గందరగోళానికి గురిచేశారని వ్యాఖ్యానించారు. ఆయన చేసిన వ్యాఖ్యలను మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు తీవ్రంగా ఖండిస్తున్నారు. గతంలోనూ సుజాతను ఉద్దేశించి ఆయన ఇదే రీతిలో వ్యాఖ్యలు చేశారంటూ ఆందోళనకు దిగారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మున్నూరుకాపు సంఘ భవనంలో సభ్యులంతా చేరి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన చేపట్టారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీగా బయలుదేరి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కంది ఇకనైనా తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు విఠల్ మాట్లాడుతూ.. సుజాతపై శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే మున్నూర్‌కాపు సమాజం సహించదని స్పష్టం చేశారు. కంది వ్యాఖ్యలను సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు కలాల శ్రీనివాస్, సభ్యులు ఉష్కం రఘుపతి, గండ్రత్ మహేందర్, సాయి, బండారి సంతోష్, గండ్రత్ సంతోష్ ఉన్నారు.

# మక్క రైతు దగా

- అన్నదాతలను నిలువునా దోచుకుంటున్న దళారులు
- కల్లాల వద్దకే వచ్చి కాంటా పెడుతున్న వీధి వ్యాపారులు
- కాంగ్రెస్ సర్కారు కొనుగోళ్లు చేయకపోవడంతో నష్టపోతున్న కర్షకులు
- రాత్రి, పగలు యథేచ్ఛగా మహారాష్ట్రకు తరలింపు
- అక్రమ వ్యాపారులకు మార్కెటింగ్ శాఖ అండదండలు
- మార్కెట్ ఆదాయానికి భారీగా గండి



కుభీర్ : అక్రమంగా పార్డి(కె) రోడ్డు గుండా మహారాష్ట్రకు తరలుతున్న మక్కల లోడుతో వెళ్తున్న లారీ

కుభీర్, మే 15 : నిర్మల్ జిల్లా కుభీర్ మార్కెట్ పరిధిలోని పార్డి(కె), పల్సి, చాత, పార్డి(బీ), మాలేగావ్, సొనారి, నిగ్వతోపాటు చాలా గ్రామాల నుంచి వీధి వ్యాపారులు మక్కలను మహారాష్ట్రకు తరలిస్తున్నారు. అయినప్పటికీ మార్కెటింగ్ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో మార్కెట్ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. సరిహద్దు మహారాష్ట్రలోని మొకండి, అప్పారావుపేట్, హిమాయత్‌నగర్‌లతోపాటు మండలంలోని చొండి, చాతలకు చెందిన వీధి వ్యాపారులు ఆయా గ్రామాల రైతుల వద్దకే వచ్చి కొనుగోళ్లు చేస్తున్నారు. క్వింటాలుకు 4కేజీల కట్టి, తూకాల్లో మోసాలు, అడతి, హమాలీ పేరిట దోపిడీ, తేమ పేరిట ధరల్లో వ్యత్యాసం ఇలా రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. క్వింటాలు మక్కలకు మార్కెట్‌లో రూ.2,160 నుంచి రూ.2,200 ధర పలుకుతున్నా.. రూ.2వేల నుంచి రూ.2,060 చెల్లిస్తు దగా చేస్తున్నారు. దాదాపు మార్చి మొదటి వారం నుంచి ప్రారంభమైన మక్కల సీజన్ కొనసాగుతూనే ఉంది. ఈ పాటికే వందలాది లారీల్లో లక్షల క్వింటాళ్ల మక్కలను తరలించారని అంచనా. కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను భర్తీ చేయకపోవడం, పార్లమెంటు ఎన్నికలు రావడం, మార్కెట్ కమిటీ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయక పోవడంతో రెచ్చి పోయిన వ్యాపారులు లైసెన్సులు లేకుండా తరలించారు. దీంతో మార్కెట్ ఆదాయానికి గండి ఏర్పడింది. కలెక్టరు, జిల్లా మార్కెటింగ్ అధికారు లు చెక్ పెట్టడంతోపాటు, ఇప్పటి వరకు కొనుగోలు చేసిన మక్కలకు మార్కెట్ సెస్సు వసూలు చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

### నాకు తెలీదు.. సమాచారం ఇస్తే సెస్సు కట్టిస్తా..

"గ్రామాల్లో వ్యాపారులు మక్కలు కొనుగోలు చేస్తున్నది నాకు తెలీదు. సమాచారం ఇస్తే సెస్సు కట్టిస్తా. వీధి వ్యాపారులకు లైసెన్సులు లేని మాట వాస్తవమే. నేనొక్కడిని ఏం చేయగలను. నలుగురే సిబ్బంది ఉన్నారు. అనుకున్నంత సిబ్బం ది ఉంటే వ్యాపారులను పిలిపించి సెస్సు కట్టిద్దుము. ఎక్కడ కూడా మార్కెట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయలేని మాట వాస్తవం

-గంగన్న, మార్కెట్ కార్యదర్శి, కుభీర్

# బీఆర్ఎస్‌దే విజయం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

- బీజేపీ, కాంగ్రెస్‌లను ప్రజలు తిరస్కరించారు..
- రెండు పార్టీలు మద్యం, డబ్బులు పంపిణీ చేశాయి..
- కార్యకర్తలు కష్టపడి పనిచేశారు.. ధన్యవాదాలు..
- మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, మే 15(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి భారీ మెజార్టీతో విజయం సాధిస్తాడని మాజీ మంత్రి జోగు రామన్న ధీమా వ్యక్తం చేశారు. బుధవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో లేకపోయినా నాయకులు, కార్యకర్తలు 20 రోజులు కష్టపడి పార్టీ విజయానికి పనిచేశారని, వారికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అధికారాన్ని ఉపయోగించుకుని ఓటర్లను ప్రలోభపెట్టడానికి విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంపిణీ చేశాయని, అధికారులు రెండు పార్టీల ఆగడాలను అరికట్టడంలో విఫలమయ్యారని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో గల 10.30 లక్షల మందికి పథకాల కింద ప్రయోజనం చేకూరిందన్నారు. లబ్ధిదారుల్లో 50 శాతం ఓట్లు పడ్డాయనే అంచనాకు వచ్చామని, దీంతో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు విజయం ఖాయంగా మారిందని పేర్కొన్నారు.

### బీజేపీ, కాంగ్రెస్‌లను ప్రజలు నమ్మడం లేదు..

కేంద్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో ఐదు నెలలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మడం లేదన్నారు. ప్రధాని మోదీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించారని, ఇటీవల ఆదిలాబాద్ పర్యటనకు వచ్చిన ఆయన కేంద్రం పరిధిలో ఉన్న పెండింగ్‌లో ఉన్న సీసీఐ, ఆర్మూర్, ఆదిలాబాద్ రైల్వేలైన్, విమానాశ్రయం విషయంలో మాట్లాడలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం పదేళ్లలో దేశంలో 10 వేల పరిశ్రమలను మూసివేసిందని, సీసీఐని అదానీ, అంబానీలకు కట్టబెడుతారన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లను ఎత్తివేయడానికి ప్రణాళికలు తయారు చేసిందన్నారు. యువతకు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిన ప్రధాని మోదీ మోసం చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఐదు నెలల పాలన అస్తవ్యస్తంగా మారిందని, సోనియాగాంధీ పుట్టిన రోజు డిసెంబరు 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న రేవంత్‌రెడ్డి, దేవుళ్లపై ఒట్టు పెట్టుకుంటూ ప్రజలను మరోసారి మోసం చేశారని తెలిపారు. రూ.4 వేల పింఛన్, కల్యాణ లక్ష్మి కింద తులం బంగారం హామీలు అటకెక్కాయని, పంటల కొనుగోళ్లు లేక రైతులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, మెట్టు ప్రహ్లాద్, సాజిదొద్దీన్, విజ్జిగిరి నారాయణ, అజయ్, దాసరి రమేశ్, శ్రీనివాస్, పర్వీన్ పాల్గొన్నారు.